ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలి

దేవరకద్ర : కోయిల్‌సాగర్ ప్రాజెక్టు వద్ద కలెక్టర్

● **కలెక్టర్ విజయేందిర బోయి**

దేవరకద్ర రూరల్ (కౌకుంట్ల), సెప్టెంబర్ 2 : జిల్లాలో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువు కాల్వలు, వాగులు ప్రమాదస్థాయికి మించి ప్రవహిస్తున్నాయి. ఇలాంటి సమయంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర అధికారులకు ఆదేశించారు. సోమవారం కౌకుంట్ల మండల శివారులో వాగుప్రవాహాన్ని ఆమె పరిశీలించారు. కౌకుంట్ల-ఇస్రంపల్లి గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడినప్పటికీ, అత్యవసరమైన పరిస్థితుల్లో ఇతరమార్గం ద్వారా వెళ్లేవిధంగా ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ ఎల్లన్న, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులు నాగిరెడ్డి, బుచ్చన్న, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దేవరకద్ర, సెప్టెంబర్ 2 : జిల్లాలో వర్షాలు భారీగా కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయేందిరబోయి సూచించారు. సోమవారం కలెక్టర్ మండల అధికారులతో కలిసి మండలంలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తాసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేటటౌన్, సెప్టెంబర్ 2 : గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేశ్‌గౌతమ్, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులతో గణేశ్ ఉత్సవాలు 2024పై సన్నాహక సమావేశంలో మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 7న ప్రారంభమయ్యే ఉత్సవాల సందర్భం గా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ట్రాఫిక్, విద్యుత్, నీటి సమస్య, శాంతిభద్రతలు వంటి కార్యక్రమాలకు ప్రణాళికతో ముందుకుసాగాలని చెప్పారు. నిమజ్జనానికి ముందుగానే రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎస్పీ యోగేశ్‌గౌతమ్ మాట్లాడుతూ నిత్యం పోలీసు బందోబస్తుతో పాటు, నిర్విరామంగా పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ అన్ని వార్డుల కౌన్సిలర్లు, పార్టీల నాయకులు సహకరిస్తేనే నిమజ్జన వేడుకలు విజయవంతం అవుతాయన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ గరిమనరులా, మున్సిపల్ వైర్‌పర్సన్ అనసూయ, ఆర్డీవో మధుమోహన్, డీఎస్పీ లింగయ్య పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

శాంతికమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

● **మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి**

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 2: గణేశ్ వేడుకలను జిల్లాప్రజలు అన్నిరకాల పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ డి.జానకి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 7న నిర్వహించే వినాయక చవితితో పాటు, మిలాద్ ఉన్‌నబీ వేడుకలను సామరస్యంగా జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడానికి మత పెద్దలు సహకరించాలన్నారు. జిల్లాలోని ప్రతిమండప నిర్వాహకులు https://policeportal.tspolice.gov.in./index.htm అనే వెబ్‌సైట్‌లో నిర్వాహకులు వారి మండపాల వివరాలను పొందుపర చాలన్నారు. దీనికి ఎటువంటి రుసుము చెల్లించేదిలేదని తెలిపారు. మండపాల వద్ద ఎటువంటి ఇబ్బందులు ఉన్నా డయల్ 100 కానీ, జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నెంబర్ 87126-59360కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, డీఎంహెచ్‌వో పద్మ, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, ఎలక్ట్రికల్ డీఈ అనంతయ్య, డీఎస్పీ వెంకటేశ్వర్లు, వర్టికల్ డీఎస్పీ సుదర్శన్, వీహెచ్‌పీ యాదిరెడ్డి, గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మాల్యాద్రిరెడ్డి, కమిటీ సభ్యులు, ఇన్‌స్పెక్టర్లు గాంధీనాయక్, ఎజాజ్, భూత్పూర్ సీఐ రామకృష్ణ, అప్పయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గోపన్నపల్లికి వంతెన మంజూరు చేస్తా

వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

● **ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి**

భూత్పూర్, సెప్టెంబర్ 2 : మండలంలోని పోతులమడుగు గ్రామ పరిధిలోని గోపన్నపల్లి వంతెనను మంజూరు చేస్తానని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం వర్షాలకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే గోపన్నపల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా వంతెనను పరిశీలించారు. ఎమ్మెల్యే పంచాయతీరాజ్ ఏఈ స్వామితో మాట్లాడుతూ ఈ వంతెన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా గ్రామంలోనే రేషన్‌షాపు సరుకులను, ఆసరా పింఛన్లను అందజేయాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ రాజు, ఎంపీడీవో ప్రభాకరచారి, మాజీ ఎంపీపీ శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హర్యానాయక్, విజయ్, ఆనంద్‌రెడ్డి, పాల్గొన్నారు.

నాలుగు షెట్టర్ల నుంచి నీటి విడుదల

దేవరకద్ర, సెప్టెంబర్ 2 : జిల్లాలోని భారీ నీటిపారుదల కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారి జళకళ సంతరించుకుంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీవర్షాలతో ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు సోమవారం ప్రాజెక్టు 4 షెట్టర్లను తెరిచి 2,800 క్యూసెకుల నీటిని ఊకచెట్టువాగుకు వదిలారు. ప్రాజెక్టును తిలకించేందుకు జిల్లాలో నివివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. అదేవిధంగా మండలంలోని దేవరకద్ర, జీన్గురాల, గోపన్‌పల్లి గ్రామాల వాగులు పొంగిపొర్లుతున్నాయి. జీన్గురాలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వంతెనపై నుంచి రాకపోకలను నిలిపివేశారు.

ఘనంగా రామలింగేశ్వరస్వామి రథోత్సవం

ఊట్కూర్, సెప్టెంబర్ 2: మండలంలోని పులిమామిడి గుట్టపై వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామిరథోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. రథంలో రామలింగేశ్వరస్వామి ఉత్సవమూర్తిని ఊరేగించారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

వరదపాశం మహోత్సవం

మూసాపేట, సెప్టెంబర్ 2 : మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి గుట్టపై

మక్తల్‌లో రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

వరదపాశం మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణమాసపు ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివలింగానికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ముంచెత్తిన వాన

ఊట్కూర్, సెప్టెంబర్ 2: ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో మట్టిమిద్దెలు కూలిపోయాయి. బాధిత కుటుంబాల ఫిర్యాదు మేరకు కూలిన ఇండ్లను సోమవారం అధికారులు గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. మండల వ్యాప్తంగా 35మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. నష్టం అంచనా వేసేందుకు పరిశీలిస్తున్నట్లు ఆర్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

నీట మునిగిన పంటల పరిశీలన

మిడ్జిల్, సెప్టెంబర్ 2: రెండు, మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన పంటలను జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్ స్థానిక అధికారులతో పాటు పరిశీలించారు. సోమవారం మండలంలోని వాడ్యాల్, మున్ననూర్ గ్రామాల్లో పర్యటించారు. దుందుభీవాగు ప్రవాహానికి కెవల్ఐ కాలువ తెగిపోవడంతో పెద్ద ఎత్తున పంటపొలాల్లోకి నీళ్లు చేరాయి. పత్తి, వరి పంటలు పూర్తిగా నీట మునిగాయి. పంటనష్టం వివరాలను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. వారివెంట జిల్లా సహాయ అధికారి ఆంజనేయులు, ఏవో సిద్ధార్థ, ఏఈవోలు భగత్, అప్రజపాతిమా, రైతులు ఉన్నారు.

జిల్లాలో 20.9మి.మీ. సగటు వర్షపాతం

నారాయణపేట, సెప్టెంబర్ 2: నారాయణపేట జిల్లాలో సోమవారం 20.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. మరికల్ మండలంలో అత్యధికంగా 36.0 మిల్లీమీటర్లు నమోదు కాగా, కృష్ణ, మాగనూర్ మండలాల్లో 20.6 మిల్లీమీటర్ల చొప్పున అత్యల్ప వర్షపాతం నమోదైంది.

కన్మనూర్-మరికల్‌కు నిలిచిన రాకపోకలు

మరికల్, సెప్టెంబర్ 2: మరికల్- కన్మనూర్ గ్రామాల మధ్య మన్నెవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రహదారి తెగి రెండుగ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. బ్రిడ్జి వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్ రోడ్డు తెగిన ప్రాంతాన్ని పరిశీలించారు. వర్షం తగ్గిన తర్వాత రోడ్డుకు మరమ్మతులు చేసి రోడ్డును బాగు చేసి రాకపోకలను పునరుద్ధరిస్తామని తెలిపారు. రెండుగ్రామాల మధ్య త్వరగా రాకపోకలు పునరుద్ధరించి, మన్నెవాగు దగ్గర బ్రిడ్జి ఎత్తును పెంచాలని కన్మనూర్‌కు చెందిన రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలో వర్షాలకు 16ఇండ్లు కూలిపోయినట్లు ఆర్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

తాగునీటిసమస్య లేకుండా చూడాలి

దేవరకద్రరూరల్ (చిన్న చింతకుంట), సెప్టెంబర్ 2 : గ్రామాల్లో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అదికారులకు సూచించారు. గత వారం నుంచి కురుస్తున్న వర్షాలకు చెరువులు కుంటలు నిండి వాగులు, కాల్వలు ఉధృతంగా పారుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రహదారి వంతెనలపైనుంచి నీరు ప్రవహిస్తున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ సోమవారం వరదలు ఉన్న ప్రాంతాలను పరిశీలించి, ప్రజలకు ప్రమాదాలు కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

తెగిపోయిన రోడ్డు.. స్తంభించిన రాకపోకలు

ధన్వాడ, సెప్టెంబర్ 2: ధన్వాడ మండలంలోని దుడుగు తండా సమీపంలో హన్మన్‌పల్లి చెరువు నీరు ప్రవహించి రోడ్డు తెగిపోవడంతో రాకాసుల తండా,చీకరగుట్ట తండా, బుడ్డమర్రితండా, దుడుగు తండాల మీదుగా నిడుగుర్తి, చెర్లపల్లి గ్రామాల నుంచి హన్‌మన్‌పల్లి, కొండాపూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎంనిపల్లి-మంత్రోనిపల్లి మధ్య మన్నెవాగు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచాయి. అధికారులు స్పందించి తెగిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమండ్ చేశారు. పంట నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని గున్ముక్ల మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ మండల నాయకులు గౌని శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

కొత్త వంతెన కోసం ప్రతిపాదనలు పంపాలి

● **ఎమ్మెలే చిట్టెం పర్ణికారెడ్డి**

ధన్వాడ, సెప్టెంబర్ 2: మండల కేంద్రంలో నూతన వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని నారాయణపేట ఎమ్మెలే చిట్టెం పర్ణికారెడ్డి నీటి పారుదల శాఖ ఏఈ శివానంద్‌ను ఆదేశించారు. ఎన్ఆర్ఆర్ కాలనీ నుంచి కోటపక్క వీధి వరకు ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడం, లోతట్టు ప్రాంతంలో ఉండడంతో ప్రజలు వర్షాకాలం లో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే పెద్ద చెరువును సందర్శించారు. కోటపక్కవీధి-పాతపల్లి దారిలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద రెండు కొత్తవంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రహమాన్‌కాన్, సుధాకర్‌రెడ్డి, రాంచంద్రయ్య, సాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నంచర్లలో కూలిన ఇల్లు

మహ్మదాబాద్, సెప్టెంబర్ 2: మండల పరిధిలోని నంచర్లలో వర్షాలకు మున్నూరు చంద్రయ్య మట్టి మిద్దె కూలిపోయింది. అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా చంద్రయ్య కుటుంబాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. మండల సమీపంలో రామాలయం వద్ద రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు వరద నీటికి కూలిపోయి ప్రమాదకరంగా మారింది. సోమవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో అధికారులు రోడ్డుకు మరమ్మతు చేపట్టారు.

నంచర్లలో వర్షానికి కూలిన ఇల్లు

మల్కచెరువు కట్టకు గండ్లు..

మహ్మదాబాద్, సెప్టెంబర్ 2: మండలంలో అతిపెద్ద చెరువుగా పిలువబడే మల్కచెరువు కట్టపై పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. రెండు ఫీట్ల లోతు వరకు రంధ్రాలు ఏర్పడడంతో గమనించిన రైతులు అధికారులకు తెలియజేశారు. కట్టకు ప్రమాదం పొంచి ఉందని తెలుపడంతో సోమవారం ఎంపీడీవో దేవన్న, ఎస్సై శేఖర్‌రెడ్డి చెరువు కట్టను పరిశీలించారు. వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. సాగునీటి శాఖ ఏఈ మనోహర్, లక్ష్మయ్య, రైతులు పాల్గొన్నారు.

న్యూమోతీనగర్‌కు శాశ్వత పరిష్కారం చూపాలి

● **ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నంకు వినతి**

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 2: మహబూబ్‌నగర్ పట్టణంలోని న్యూమోతీనగర్ ప్రజలు ఎదుర్కొంటున్న రైల్వే బ్రిడ్జీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు మహబూబ్‌నగర్ ఎంపీ, ఎమ్మెల్యేకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. న్యూమోతీనగర్‌లోని రైల్వే బ్రిడ్జిని సోమవారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణ, ఎమ్మెల్యే యెన్నం, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ తదితరులు పరిశీలించారు. వర్షాలకు రైల్వే బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో రాకపోకలు నిలిచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మోతీనగర్ వాసులు, స్థానికులు తెలిపారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ రైల్వే అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ మోటర్లు బిగించి నిలిచిన నీటిని తోడివేయించే చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్‌కు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే గాండ్లోని చెరువును పరిశీలించారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన బైరంపల్లి మట్టిరోడ్డు

మాగనూరు, సెప్టెంబర్ 2: భారీ వర్షాలకు బైరంపల్లి మట్టి రోడ్డు కోతకు గురైందని గ్రామస్తులు తెలిపారు. దీనివల్ల రాకపోకలకు నిలిచి ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండ్రోజులుగా ఏ పనికి వెళ్లకుండా గ్రామంలోనే ఉంటున్నామని తెలిపారు. ఉపాధి, వైద్యం అందాలంటే రోడ్డుబాగు చేయాలని, స్పందించి రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మున్ననూర్‌లో పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్



బైరంపల్లి ప్రధాన రహదారి కోతకు గురైన వైనం



దేవరకద్రలో వరిపంటను పరిశీలిస్తున్న అధికారులు

బైరంపల్లి సమీపంలో కోతకు గురైన మట్టిరోడ్డు



మహ్మదాబాద్‌లో రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

చెరువునీరు బయటికి వెళ్లే మార్గాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

ఊట్కూర్‌లో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

మిడ్జిల్ నీటమునిగిన పంటలను పరిశీలిస్తున్న అధికారులు

కౌకుంట్లలో వాగును పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర

ధన్వాడ : హన్మన్‌పల్లి తండా వద్ద తెగిన రోడ్డు

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట, సెప్టెంబర్ 2: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న మేనేజ్‌మెంట్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఈనెల 31లోపు 2024-25 విద్యా సంవత్సరానికి పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు (ఫ్రెష్, రెన్యూవల్) చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఉమాపతి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు.

అతిథి అధ్యాపకులకు ఆహ్వానం..

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 2: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మెర్సీవసంత సోమవారం ప్రకటనలో తెలిపారు. నెట్, స్లెట్, పీహెచ్‌డీ అర్హతలు ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని, డిగ్రీ కళాశాల పరిధిలో పనిచేసిన వారు సర్వీస్ సర్టిఫికెట్ దరఖాస్తు జతపరచాలని తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 3వ తేదీ సాయంత్రం 4గంటలలోపు కళాశాలలో తమ దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

చికిత్సకు రూ.40వేలు ఆర్థికసాయం

మిడ్జిల్, సెప్టెంబర్ 2: మిడ్జిల్‌లోని వ్యాపార సంఘం సభ్యుడు రాఘవేందర్ చికిత్స కోసం సంఘం సభ్యులు రూ.40వేలు ఆర్థిక సాయం చేశారు. సోమవారం మండలంలోని వాడ్యాల్ గ్రామానికి చెందిన రాఘవేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, మెరుగైన చికిత్స కోసం ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గంజికృష్ణ, రాజేశ్వర్, యాదయ్య, హైమద్, జహంగీర్, బాల్‌నారాయణ, జహీర్, నరసింహ, శ్రీనివాసులు, బాబా, అశోక్, ఆంజనేయులు, భీమ్‌రాజు, కేశవ్ ఉన్నారు.

యువకుడు అదృశ్యం: కేసు నమోదు

జడ్చర్ల, సెప్టెంబర్ 2: మండలంలోని గొల్లపల్లికి చెందిన యువకుడు దయ్యాల కుమార్(30) ఆగస్టు 28 నుంచి కనిపించడం లేదని జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. దవాఖానకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి, తిరిగి రాలేదని పేర్కొన్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లేకపోవడంతో తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

నోటీసులు ఇవ్వకుండా ఇండ్లు కూలుస్తారా?

కూల్చివేసిన ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీ అరుణ

● **శాశ్వత పట్టాలు వెంటనే జారీ చేయాలి**
● **మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ**

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 2: నోటీసులు ఇవ్వకుండా దివ్యాంగుల ఇండ్లను ఎట్లా కూలుస్తారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. సోమవారం మహబూబ్‌నగర్‌లోని ఆదర్శనగర్‌లో దివ్యాంగుల రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించారు. అధికారులు కూల్చిన ఇండ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 2007, 2008, 2009, ఆ తర్వాత ఇచ్చిన పట్టాలు బాధితుల వద్ద ఉన్నాయన్నారు. నిరుపేదలైన దివ్యాంగులందరికీ శాశ్వత పట్టాలు వెంటనే అందించాలని, ఇండ్లను కట్టించి ఇవ్వాలన్నారు. పట్టాలు అమ్మిన వారిపై కలెక్టర్ విచారణ చేయాలన్నారు. కార్యక్రమాల్లో భాజపా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు అంజయ్య, కృష్ణవర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, కె.సతీశ్‌కుమార్, సంపత్‌కుమార్, సుబ్రమణ్యం, పోతుల రాజేందర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, వీరన్న, యాదయ్య పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

● **రూ.6లక్షల నగదు, వెండి అగ్నికి ఆహుతి**

మూసాపేట, సెప్టెంబర్ 2 : మండలంలోని స్ఫూర్తి తాండా గ్రామంలో ముడావత్ అమిర్య నాయక్ ఇల్లు ప్రమాదవశాత్తు విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. ఇందుకు సంబంధించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ముడావత్ అమిర్యానాయక్ శ్రావణ మాసం పురస్కరించుకొని ఇల్లుకు కలర్ పెయింటింగ్ చేసిన మన్యంకొండకు వెళ్లారు. వర్షాలకు ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో కరెంట్ వైర్లు కాలడంతో ఇల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. విషయం తెలియడంతో అగ్నిమాపక దళానికి ఫోన్ చేయగా, ఫైరింజన్ వచ్చేలోగా పూర్తిగా కాలిపోయాయి. ఇంట్లో నగదు రూ.6లక్షలు, 20తులాల వెండి, బట్టలు, వంట పాత్రలు కాలి బూడిదైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా అమిర్యానాయక్ కుటుంబానికి మాజీ సర్పంచ్ లలితానరేష్ నాయక్ రూ.5వేలు, రాజేశ్‌నాయక్ రూ.5వేలు, మాజీ ఎంపీటీసీ కండ్యానాయక్ రూ.50వేలు, కూరగాయలను అందజేస్తారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్ఫూర్తి తాండాల్లో కాలిపోయిన ఇల్లు

జీపీఎఫ్ స్లిప్పులు వెంటనే అందించాలి



జెడ్పీ సీఈవోకు వినతిని అందజేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 2: జెడ్పీ జీపీఎఫ్ ఖాతాలను అప్ టు డేట్ చేసి పెండింగ్‌లో ఉన్న వార్షిక స్లిప్‌లను వెంటనే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఉపాధ్యాయులకు అందించాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.శ్యామ్‌బాబు, రమాకాంత్ కోరారు. సోమవారం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి (జెడ్పీ సీఈవో) వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబ్‌నగర్ నుంచి రంగారెడ్డి, నారాయణపేట తదితర జిల్లాలకు బదిలీ అయిన వారి ఖాతాలకు సంబంధించిన రికార్డు, నగదును వారి జిల్లాలకు బదిలీ చేయాలన్నారు.అనంతరం జెడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డిని సన్మానించారు. పీఆర్టీయూ నాయకులు నాగిరెడ్డి, ఎస్.యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణ

బాలానగర్, సెప్టెంబర్ 2: మండల కేంద్రంలోని రజక కుల స్థులకు చెందిన పురాతన శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామానికి చెందిన రజక కులస్థులు రాములు, మల్లేశ్, గోవర్ధన్, భాస్కర్ తదితరులు ఆరోపించారు. నాలుగు రోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తులు కొందరు సదరు శ్మశాన స్థలాన్ని జేసీబీతో చదును చేశారని ఆరోపించారు. ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ కార్యదర్శికి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలానగర్ ఎస్సై తిరుపాజీ సోమవారం గ్రామస్తులతో స్థలాన్ని పరిశీలించారు.

పెద్దచెరువులో వరద పాశం విడుదల

ఊట్కూర్, సెప్టెంబర్ 2: భారీ వర్షాలతో ఊట్కూర్ పెద్ద చెరువు అలుగు పారింది. సోమవారం ఆయకట్టు రైతులు మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అలుగు నీటిలో వరద పాశం విడుదల చేశారు. పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కర